సాక్షి
వికారాబాద్
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



అక్కరకు రాని ఆస్తులు!
ఎంతో కష్టపడి, అప్పులు చేసి కట్టుకున్న ఇళ్లకు యాజమాన్య హక్కులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



ఆశాజనకంగా గుమ్మడి
అంతర పంటలుగా గుమ్మడి, స్వీట్‌కార్న్, కూరగాయలు, బంతి, ఆకు కూరలు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. 8లో▸



హైహై వినాయక
వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణపతుల విగ్రహాల క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

తెలంగాణ ఖ్యాతి చాటాలి



క్రీడాకారిణి రుక్మిణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్ అర్బన్: ఖోఖో అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన రుక్మిణి తెలంగాణ ఖ్యాతిని చాటాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల కళాశాల ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కావలి రుక్మిణి ఇండియన్ ఖోఖో జట్టుకు ఎంపికై ంది. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ రమణమ్మ విద్యార్థిని రుక్మిణితో కలసి ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఖోఖో పోటీలకు తెలంగాణ తరఫున రుక్మిణి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్నేషనల్ పోటీల్లో సత్తాచాటి భారత్ పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం రుక్మిణిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గోపాల్, ఉపాధ్యాయులు అంజిలప్ప, శ్రీనివాస్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

16న తాండూరుకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

తాండూరు టౌన్: ఈనెల 16న తాండూరు పట్టణానికి బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్ ముదిరాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ కూడా హాజరవుతున్నారని తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బహుజనులందరూ ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు



కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

వికారాబాద్ అర్బన్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం యాదగిరి యాదవ్‌తో పాటు పలువురు నగరంలోని ఆర్ కృష్ణయ్య ఇంటికి వెళ్లి కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్ కృష్ణయ్య మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. బీసీల హక్కుల కోసం ఎనలేని సేవలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గంగుల సంగయ్య, ప్రశాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోకిల రైతులకు ప్లాట్‌నంబర్ల కేటాయింపు

శంకర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం శంకర్‌పల్లి మండలంలోని మోకిల వద్ద చేసిన హెచ్‌ఎండీఏ వెంచర్‌లో భూమిని కోల్పోయిన రైతులకు ప్లాట్ నంబర్లను కేటాయించింది. బుధవారం మోకిలలోని రైతువేదిక వద్ద చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ సురేందర్, ఆర్‌ఐ విక్రమ్ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని మోకిల వద్ద ఉన్న సర్వే నంబర్ 197లో హెచ్‌ఎండీఏ వెంచర్‌లో భూములను ప్రభుత్వానికి అప్పగించిన 133 మంది రైతులకు ప్లాట్ల నంబర్లను కేటాయించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ రూల్స్ ప్రకారం ముందుగా భూమిని తీసుకున్న రైతులకు ఇవ్వాల్సిన దాని ప్రకారం వారికి ప్లాట్ల నంబర్లను కేటాయించారని చెప్పారు. ఇక తదుపరి కార్యక్రమాలు హెచ్‌ఎండీఏ చేసుకుంటుందన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

షాబాద్: చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి పెద్ద చెరువులో బుధవారం షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి సుమారు 6లక్షల చేపపిల్లలను వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో షాబాద్, చందనవెల్లి చెరువుల్లో నీరు చేరడంతో చేపలను వదిలినట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం మ త్స్యకారులను పట్టించుకోలేదన్నారు. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం తీసు కువచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు.

ముహూర్తం ఖరారు



అనంతగిరిలో వైద్య కళాశాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారుల బృందం

రేపటి నుంచి వైద్య కళాశాల తరగతులు
- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- వంద మంది విద్యార్థులకు సీట్లు
- 280 పడకలతో జనరల్ ఆస్పత్రి

వికారాబాద్: జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారుతోంది. వికారాబాద్‌కు రోజుకో ఆరోగ్య సంస్థ వచ్చిన చేరుతుండడంతో వైద్య పరంగా జిల్లాకు మంచి రోజులు వచ్చినట్లు అవుతోంది. ప్రస్తుతం తాండూరులో జిల్లా ఆస్పత్రి ఉండగా జిల్లా కేంద్రంలో కేవలం ఏరియా ఆస్పత్రి మాత్రమే ఉంది. ఇప్పటికే ప్రభుత్వం జిల్లా కేంద్రం వికారాబాద్‌కు మెడికల్ కళాశాల, ఆయూష్ ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ సెంటర్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 15న సీఎం కేసీఆర్ మెడికల్ కళాశాలను వర్చువల్ పద్ధతిన ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి అనంగిరిలోని కళాశాల భవనాలను, అక్కడ జరుగుతున్న ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా తాత్కాలిక భవనంలో కళాశాలను ప్రారంభించనున్నారు. అనంతగిరి గుట్టపై ఉన్న టీబీ శానిటోరియం ఏరియాలో కళాశాల, గుట్ట కింద ఎస్‌ఏపీ కళాశాల ఎదురుగా జనరల్ ఆస్పత్రిని నిర్వహించనున్నారు.

100 సీట్లతో వైద్య కళాశాల

కళాశాల ప్రారంభం రోజు నుంచే తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కళాశాలకు ప్రభుత్వం వంద సీట్లు కేటాయించింది. రాష్ట్ర వాటాగా 85, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 15 సీట్లు కేటాయించేలా నిర్ణయించారు. ఇప్పటికే కౌన్సిలింగ్ సైతం పూర్తయింది, ఇప్పటి వరకు 90 మంది విద్యార్థులు రిపోర్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వైద్య కళాశాలతోపాటు 280 పడకల జనరల్ ఆస్పత్రిని సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. చిన్న చిన్న పనులు మినహా తరగతి గదులు, హాస్టల్ భవనం పూర్తయింది.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

శుక్రవారం ప్రారంభం కానున్న ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రి భవనాలను బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షించారు. చేపట్టాల్సిన పనులను సంబంధిత అధికారులకు సూచించారు.అడ్మినిస్ట్రేషన్ విభాగం, ఫిజియాలజీ, బయో కెమెస్ట్రీ విభాగం పనులపై ఆరా తీశారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీహెచ్‌ఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్, వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మ మాలిని, డీఎస్‌డీఓ మల్లేశం, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలపతిరావు, డీఈ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జాకిర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి, అధికారులు

ఉత్సవాలను సక్సెస్ చేద్దాం

- వినాయక చవితి, నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వినాయక చవితి పండుగను, నిమజ్జన వేడుకలు, జాతీయ సమైక్యత దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమితతో కలిసి గణేశ్ ఉత్సవాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేసి వినాయక చవితి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో లైటింగ్, క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతుల చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 17న జరిగే జాతీయ సమైక్యత దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. వినాయక మండపాల వద్ద, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు లేవన్నారు. తాండూరులో నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి ఎక్కువ మంది పోలీసులను నియమించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్ సింగ్ డీపీఓ తరుణ్ కుమార్ జిల్లా వైద్యాధికారి పాల్వన్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు పాల్గొన్నారు.

'గొర్రెల పథకంలో గోల్‌మాల్'పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

దౌల్తాబాద్: మండలంలో గొర్రెల పంపిణీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలపై బుధవారం సాక్షి దినపత్రికలో గొర్రెల పథకంలో గోల్‌మాల్ శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్ ఆదేశాలతో మండల పశువైద్యాధికారి హథిన్ గుముడాల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. పథకం పొందిన వారి ఇళ్లు, పొలాల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. అయితే జీవాలను మేతకు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాము ఎవ్వరికీ గొర్రెలను విక్రయించలేదని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ పథకం పొందిన లబ్ధిదారులు జీవాలను అమ్ముకున్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు రోజుల తరువాత తాను గ్రామానికి వస్తానని, అప్పుడు గొర్రెలను చూపించాలని ఆయా కుటుంబ సభ్యులకు సూచించారు.



గుముడాల గ్రామంలో గొర్రెలను పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి హథిన్

బీఆర్‌ఎస్‌కు 'కోరుపోలు' రాజీనామా

- ఎంపీపీ, ఎంపీటీసీ పదవులను వదులుకుంటున్నట్లు వెల్లడి

మహేశ్వరం: మహేశ్వరం ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి తన ఎంపీపీ, ఎంపీటీసీ రెండు పదవులకు రాజీనామా చేశారు. జెడ్పీసీఈఓ దిలీప్‌ని బుధవారం కలిసిన కోరుపోలు.. తన రాజీనామా లేఖను అందించారు. 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో ఘట్టుపల్లి ఎంపీటీసీగా (బీఆర్‌ఎస్) కోరుపోలు గెలుపొందారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ సహాయంతో ఎంపీపీగా ఎన్నికయ్యారు. అయితే ఈనెల 12న బీఆర్‌ఎస్ పార్టీని వీడిన కోరుపోలు.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒక పార్టీ గుర్తు మీద గెలుపొంది మరొక పార్టీలో చేరడంతో.. నైతిక విలువలు పాటిస్తూ అట్టి పదవులను కొనసాగించడం భావ్యం కాదని భావించి.. ఎంపీపీ, ఎంపీటీసీ రెండు పదవులకు రాజీనామా చేస్తున్నానని కోరుపోలు తెలిపారు.

దేశానికే దిక్సూచి తెలంగాణ



చిట్టిగిద్ద గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట్: తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశానికే దిక్సూచిగా మారిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని వట్టి మీనపల్లి, చిట్టిగిద్ద గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యావత్ దేశం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులు బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలు చేయడం లేదన్నారు. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంపీటీసీలు పద్మ, ఎక్బాల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు శ్రీలత, ప్రభాకర్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, విజయలక్ష్మి, అజయ్‌కుమార్, ఎండీ రఫీ, రత్నం, పరమయ్య బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

- మంత్రి మహేందర్‌రెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



అల్లాపూర్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

దౌల్తాబాద్: సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఆయన్ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేద్దామని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం చంద్రకల్, కుప్పగిరి, గుండేపల్లి, ఎల్‌జీ తండాలో రూ.7.55 కోట్లతో జీపీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. దేశంలో ఎక్కడా రైతుబంధు, రైత బీమా, దళిత బంధు, గృహలక్ష్మి, మిషన్ భగీరథ వంటి పథకాలు లేవన్నారు. సంక్షేమ పథకాలు నచ్చే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతు న్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మట్లాడుతూ.. రోజురోజుకూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతోందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్‌ను కేసీఆర్ అభివృద్ధి చేశారని తెలిపారు. త్వరలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచులు నర్సిరెడ్డి, హరికృష్ణ, మధుసూదన్, పాండు నాయక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్

- దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ్
- నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్

కొడంగల్ రూరల్: వికలాంగుల పెన్షన్‌ను రూ. 10వేలకు పెంచాలని, ఉచిత విద్యుత్, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ వికలాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కల్పించాలని, వికలాంగుల కమిషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలన్నారు. రాష్ట్రంలో 43.04లక్షల మంది వికలాంగులు ఉన్నారని, ప్రస్తుతం వారికి ఇస్తున్న రూ, 4,016 పెన్షన్ ఏ మాత్రం సరిపోవడం లేదని, ఈ మొత్తాన్ని రూ, 10వేలకు పెంచాలని కోరారు. ఆసరా పెన్షన్లకు ఆదాయ పరిమితి సరికాదని, ఇందుకు సంబంధించిన జీఓ నంబర్ 17ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉద్యోగ నియామకాల్లో శారీరక వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించాలని కోరారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్టీసీ శాఖలు నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను 25శాతం అద్దెతో కేటాయించాలన్నారు. హక్కుల సాధన కోసం దశల వారీగా చేపట్టనున్న ఉద్యమాలకు వికలాంగులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా మహిళా కన్వీనర్ సావిత్రమ్మ, మీడియా కన్వీనర్ మారుతి, సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశం, యాదమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎదురు చూపులే..!



- ఎరువుల కోసం రైతుల నిరీక్షణ
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఏటా ఇదే పరిస్థితి అంటున్న అన్నదాతలు

పెద్దేముల్: వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఏటా ఇదే సమస్యతో కాలం వెల్లదీయాల్సి వస్తోందని వాపోతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ రాతలు మారడం లేదని మండి పడుతున్నారు. ప్రభుత్వం అరకొర ఎరువులు పంపిణీ చేస్తుండడంతో సమస్య వస్తోందని తెలిపారు. వారం రోజుల నుంచి యూరియా కోసం అల్లాడుతున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. నెల రోజుల నుంచి వర్షాల కోసం ఎదురు చూశామని, మూడు రోజులుగా వానలు పడుతుండడంతో పంటలకు కొంత మేలు జరిగిందన్నారు. అయితే సకాలంలో ఎరువులు దొరక్క ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలకు ఎరువులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఫెర్టిలైజర్స్ దుకాణాలకు వెళితే ఎరువులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాల చుట్టు తిరిగి తిరిగి విరక్తి వస్తోందన్నారు. ప్రభుత్వం సహకార సంఘాలకు కూడా సక్రమంగా ఎరువులు సరఫరా చేయడం లేదని పలువురు ఆరోపించారు. కొంత మంది పంటలను కాపాడుకునేందుకు కర్ణాటక రాష్ట్రం కుంచారం, సేడెం నుంచి ఎరువులు దిగుమతి చేసుకుంటున్నారు. గత ప్రభుత్వాలు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని మండలంలోని బుద్దారం, తింసాన్‌పల్లి, గాజీపూర్, మారేపల్లి, మంబాపూర్ రైతులు ఆరోపించారు. గతంలో ఆగ్రోస్, తట్టిపల్లి పీఏసీఎస్, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘాల్లో కావాల్సిన మేర ఎరువులు ఉండేవన్నారు. ప్రస్తుతం పత్తి, కంది, చెరుకు పంటలకు యూరియా తోపాటు పోటాష్ అవసరమన్నారు. వారం రోజుల నుంచి తిరుగుతున్నా కిలో యూరియా కూడా దొరకడం లేదని పలువురు రైతులు తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని మండిపడుతున్నారు.

కావాల్సిన ఎరువులు

మండలం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గత ఏడాది ఈ ప్రాంతం రైతులకు సుమారు 700 టన్నుల యూరియా, డీఏపీ 250 టన్నులు, కాంప్లెక్స్ 500 టన్నులు, పోటాష్ 200 టన్నులు అవసరం కాగా అరకొరగానే అందుబాటులో ఉంచారు. ఈ ఏడాది మండలానికి ఎంత మోతాదులో ఎరువులు కావాలి అనే విషయాన్ని ఏఓ నజీరొద్దీన్‌ను వివరణ కోరగా రేపు, మాపు అంటూ సమాధానం దాటవేస్తున్నారు.

ఆగ్రోస్‌ను పునఃప్రారంభించాలి



మండలంలో ఎరువులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నాం. మూసేసిన ఆగ్రోస్‌ను పునఃప్రారంభించాలి. అలాగే సాగుకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలి. రైతు సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు గ్రామాల్లో పర్యటించి సూచనలు, సలహాలు ఇవ్వాలి.

– నందారెడ్డి, రైతు, తింసాన్‌పల్లి

ఎరువులు అందుబాటులో ఉంచాలి



వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా మండల రైతులకు ఎరువులు దొరకడం లేదు. ఈ సమస్యను వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో పంటలకు ఎరువులు ఎంతో అవసరం. ఇప్పటికైనా ప్రభుత్వం ఎరువులు సరఫరా చేయాలి.

– నవాబ్, రైతు, పెద్దేముల్

త్వరలో ఎరువులు



త్వరలో మండలానికి ఎరువులు వస్తాయి. యూరియా,పోటాష్ సమస్య రాకుండా చుస్తాం. ఎరువుల కోసం రైతులు దిగాలు చెందాల్సిన అవసరం లేదు. 24 గంటల్లో తట్టిపల్లి పీఏసీఎస్‌కు, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘానికి ఎరువులు వస్తాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయిస్తాం. అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి.

– నజీరొద్దీన్, ఏఓ, పెద్దేముల్

క్లుప్తంగా

సేవలకు గుర్తింపు

సత్యసాయి సేవా సమితి
సభ్యులకు కలెక్టర్ ప్రశంస



దశరథ్‌ను అభినందిస్తున్న
కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్ రూరల్: శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డి భజన మండలి సభ్యుడు దశరథ్‌కు ప్రశంసాపత్రం అందించారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట మండలాలలో క్షయవ్యాధి బాధితులకు శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సమితి సేవలను గుర్తించిన కలెక్టర్ నారాయణరెడ్డి సభ్యులను అభినందిస్తూ జిల్లా కేంద్రంలో బుధవారం భజన మండలి సభ్యుడు దశరథ్‌కు ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వందమందికి 'కల్యాణ లక్ష్మి'



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న
ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వంద మంది లబ్ధిదారులకు కోటి రూపాయల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధు, గృహలక్ష్మి పథకానికి అర్హులందరికీ దశలవారీగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యుడు మేఘమాల, వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్ నవ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు రౌడీషీటర్ల బైండోవర్

అబ్దుల్లాపూర్‌మెట్: వచ్చే వినాయకచవితి, ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు రౌడీ షీటర్లను అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ ఎదుట పోలీసులు బుధవారం బైండోవర్ చేశారు. బాటసింగారం గ్రామానికి చెందిన మాదారం సాయికార్తీక్, అబ్దుల్లాపూర్‌కు చెందిన రాహుల్‌లు ప్రజాశాంతికి భంగం కల్గించే విధంగా ప్రవర్తించే అవకాశమున్నందున ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వారిలో సత్ప్రవర్తన రావాలనే ఆలోచనతోనే బైండోవర్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

అక్కరకు రాని ఆస్తులు!

గ్రామాల్లోని ప్రజల ఆస్తులను ప్రభుత్వం ఆన్‌లైన్ చేయడంతో కొనుగోలు, అమ్మకం, విరాసత్ ప్రక్రియలకు ఆటంకం కలుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ఇల్లు లేదా ఇంటి స్థలాలను విక్రయించేందుకు యాజమాన్య హక్కులు లభించడం లేదు. ఫలితంగా అవసరాలకు డబ్బులు అందక అనేక మంది అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై సర్కారు సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

- యాజమాన్య హక్కులకు సర్కారు బ్రేక్
- అత్యవసరాల్లో అమ్ముకోలేని దుస్థితి
- ఇళ్లు, ఇంటి స్థలాల అమ్మకాలకు సాదా బైనామాలే దిక్కు
- ముందుకు రాని కొనుగోలుదారులు అవస్థలు పడుతున్న గ్రామీణ ప్రజలు



మోమిన్‌పేటలో అమ్మకానికి ఉన్న ఇల్లు

మోమిన్‌పేట: ప్రతిఒక్కరూ తమ జీవితంలో ఒక మంచి ఇల్లు కట్టుకోవాలనుకుంటారు. ఇందుకు ఎంతో కష్టపడి, అప్పులు చేసి కలను సాకారం చేసుకుంటారు. తమకంటూ ఒక స్థిరాస్తి ఉందని సంబరపడతారు. దీన్ని వారసులకు ఇచ్చి మురిసిపోతారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు యాజమాన్య హక్కులు లేకుండాపోయాయి. ఫలితంగా ఏదైనా అత్యవసరమైన సమయాల్లో అమ్ముకుందామంటే కుదరడం లేదు. ఇతరుల పేరున రిజిస్ట్రేషన్, వారసుల పేరున మ్యుటేషన్ కావడం లేదు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదు

వ్యవసాయ భూముల కొనుగోలు, అమ్మకం వ్యవహారాల్లో యాజమాన్య హక్కులు కల్పిస్తుండటంతో అవసరమైన సమయంలో అమ్ముకునే వీలుంటుంది. లేదంటే కనీసం బ్యాంకులు లేదా ప్రైవేటు వ్యక్తుల వద్ద తనఖా పెట్టుకుని రుణం తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించుకుంటున్న ఇళ్లకు ఎలాంటి యాజమాన్య హక్కులు ఉండటం లేదు. తప్పని పరిస్థితిలో ఇంటిని విక్రయించాలంటే సాదాబైనామా ద్వారానే లావాదేవీలు ముగించాలి. కొనుగోలుదారుడి ధైర్యంతోనే ఇది సాధ్యమవుతుంది. రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశం లేకపోవడంతో చాలామంది ఇందుకు సాహసించడం లేదు.

నిలిచిన క్రయ, విక్రయాలు

గతంలో ఎవరైనా ఇల్లు అమ్మాలనుకుంటే.. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని రికార్డుల ఆధారంగా సంబంధిత కార్యదర్శి యాజమాన్య హక్కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేవారు. ఏడేళ్ల క్రితం ఈ విధానాన్ని నిలిపేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామాల్లోని ఇళ్ల అమ్మకం, కొనుగోలు ప్రక్రియ కష్టతరంగా మారింది. ఆరోగ్య పరిస్థితుల వల్ల, కూతుళ్ల వివాహాలు, కొడుకుల ఉన్నత చదువుల కోసం ఇంటిని అమ్మేద్దామంటే యాజమాన్య హక్కులు లేక అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి లిఖిత పూర్వకంగా ఇస్తేనే సదరు ఇల్లు రిజిస్ట్రేషన్ అవుతుందని పేర్కొంటున్నారు.

మ్యుటేషన్ కావడం లేదు



ఇంటికి సంబంధించిన ఆస్తి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మ్యుటేషన్ చేస్తాం. ప్రస్తుతం యాజమాన్య హక్కులను ఇవ్వడం లేదు. విరాసత్, మ్యుటేషన్లు కావడం లేదు. ఆస్తికి సంబంధించిన పూర్తి లావాదేవీలను ఆన్‌లైన్‌లోనే చేయాల్సి ఉంటుంది.

– నర్సింలు, పంచాయతీ కార్యదర్శి, మోమిన్‌పేట

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారమే..



ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారమే యాజమాన్యపు హక్కు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. గతంలో ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేవారు. ఏడాది కాలంగా ఆపేశారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకూ యాజమాన్య హక్కులు ఇచ్చే అవకాశం లేదు.

– శైలజారెడ్డి, ఎంపీడీఓ

ప్రతీ వెయ్యిలో 700 మంది ఓటర్లు

- ఇప్పటి వరకు 650 మంది నమోదు
- అవగాహన పెంచాలని అఖిలపక్ష నాయకులకు అడిషనల్ కలెక్టర్ సూచన



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న
అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: ఓటరు నమోదు ప్రక్రియను వినియోగించుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ తహసీల్దార్లు, అఖిలపక్ష నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు నాయకులు సహకరించాలన్నారు. ప్రతీ వెయ్యి మంది జనాభాలో 700 మంది ఓటర్లు ఉండాలని, ఇప్పటివరకు 650మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఓటర్లుగా నమోదు చేసుకోని వారికి అవగాహన కల్పిస్తూ నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో సమస్యలుంటే తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు బి.విజకుమార్, ఆనంద్‌రావు, వెంకటేశ్, విజయకుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

పరిగి: ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ సహాయక కలెక్టర్ నారాయణఅమిత్ సూచించారు. మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో ఓటరు అవగాహన వేదిక(చునావ్ పాఠశాల) ప్రక్రియలో భాగంగా గ్రామంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు లిస్టులో తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ప్రజలను పాలించే నాయకుడిని ఎన్నుకునే హక్కును వృథా చేసుకోరాదన్నారు. యువత తమ ఓటు హక్కుతో సరైన నాయకుడిని ఎన్నుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, సర్పంచ్ జగన్, ఏంపీఓ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు అవగాహన సదస్సులో ట్రైనీ సహాయ కలెక్టర్ నారాయణ అమిత్, డీపీఓ తరుణ్‌కుమార్

ప్రగతి పథంలో నడిపించండి



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో వీణాచారి తదితరులు

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రగతి పథంలో నడిపించాలని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గడ్డె వీణాచారి, వైస్ చైర్మన్ ఉమాశంకర్‌లతో పాటు సభ్యులు నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి రోహిత్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కమిటీ సభ్యులంతా సమష్టిగా మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరిహరగౌడ్, వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, గోవింద్, ముస్తాఫా, ఖాసీం అలీ, ప్రకాశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీం, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, రైతు సమన్వయ సమితి చైర్మన్ రాంలింగారెడ్డి, నాయకులు శ్రీనివాసచారి తదితరులున్నారు.

ఆశాజనకంగా గుమ్మడి సాగు

- వాతావరణం అనుకూలిస్తే అధిక లాభాలు
- కందిలో అంతర పంటగా పండిస్తున్న రైతులు

ధారూరు: అంతర పంటల సాగుతో రైతులు అధిక లాభాలు అర్జిస్తున్నారు. ప్రధాన పంటలో గుమ్మడి, స్వీట్‌కార్న్, కూరగాయలు, బంతి, ఆకు కూరలు తదితర వాటిని పండిస్తున్నారు. ధారూరు మండలం అవుసుపల్లి, అల్లిపూర్, హరిదాస్‌పల్లి, చింతకుంట తదితర గ్రామాల్లో రైతులు ఈ పంటలను సాగుచేస్తున్నారు. ఈ యేడు కందిలో అంతర పంటగా గుమ్మడిని పండించిన రైతులు.. ఫలితం కోసం నిరీక్షిస్తున్నారు.

ఎకరాకు 6 టన్నులు

మేనెలలో వేసిన కంది ఏపుగా పెరగగా.. వాటి సాళ్ల మధ్య జూన్ మాసంలో రైతులు గుమ్మడి విత్తనాలు విత్తారు. ఇప్పుడు గుమ్మడి సాగు చివరి దశలో ఉంది. 90 రోజుల నుంచి 120 రోజుల్లో.. ఎకరాకు 4 నుంచి 6 టన్నుల వరకు దిగుబడి చేతికి వస్తుందని, అతివృష్టి, వర్షాభావ నేపథ్యంలో ఈ సారి నష్టం మాత్రం అంతగా లేదని రైతులు చెప్పారు.



అవుసుపల్లిలో సాగు చేసిన గుమ్మడి పంట

గుమ్మడిని గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి మార్కెట్లకు తరలించి విక్రయిస్తామని, పంటకు ఎక్కువగా పురుగు ఆశించదని, వాతావరణ మార్పుల కారణంగా ఆశిస్తే కూరగాయలకు వాడే మందులను పిచికారీ చేస్తామని రైతులు పేర్కొన్నారు.

అధిక వర్షాలతో నష్టమే

గుమ్మడి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండాలని, అధిక వర్షాలు పడితే పంట పాడవుతుందని పలువురు రైతులు పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులున్నా అంతేనన్నారు. ఎకరాకు రూ.11 వేల వరకు పెటుబడి పెట్టామని, మార్కెట్లో ప్రస్తుతం ధర కిలో రూ.3 నుంచి రూ.5 మధ్యంలో కొనసాగుతుందని, ఈ సారి ఏ మేరకు లాభాలు వస్తాయో చూడాలని చెప్పారు.

'బ్రూనో' మృతితో విషాదం

బంజారాహిల్స్: 14 ఏళ్లుగా తమ కుటుంబంలో ఒకటిగా మెలిగి తమకు ఎన్నో ఆనందాలు పంచిన పెంపుడు కుక్క మృతితో మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.12 కమాన్‌లో నివసించే మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ఇంట్లో పెంపుడు శునకం బ్రూనో మృతి చెందింది. దీంతో ఇంటిల్లిపాది తల్లడిల్లిపోయారు. తమ ఇంట్లో ఒకరిగా మెలిగిన బ్రూనో మృతి మహేందర్ రెడ్డి సతీమణి, జెడ్పీ చైర్మన్ పట్నం సునీతారెడ్డిని తీవ్రంగా కలచివేసింది. తాను బ్రూనో మృతితో తీవ్ర మనోవేదనకు గురైన విషయాన్ని ట్విట్టర్ (ఎక్స్) వేదికగా షేర్ చేశారు. తమ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన అంత్యక్రియలను ఫొటోలను షేర్ చేసుకున్నారు.



పెంపుడు కుక్కతో సునీతామహేందర్‌రెడ్డి

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం వద్ద రైతులు

పూడూరు: విద్యుత్ తీగ తగిలి ఎద్దు మృతి చెందిన సంఘటన పూడూరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు కిష్టం లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్కేపల్లి గ్రామ సమీపంలో మాచీస్ ఫ్యాక్టరీ వద్ద ఎద్దు మేత మేస్తుండగా గాలివానకు 11కేవి విద్యుత్ తీగ తెగిపడి ఎద్దుకు తగలడంతో అది మృతి చెందిందని తెలిపారు. ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

ఆందోళన అనాథలను చేసింది

- ప్రమాద ఘటనలో ఆటోడ్రైవర్‌పై కేసు
- పురుగు మందు తాగి ఆత్మహత్య

తాండూరు రూరల్: ఆందోళన ఓ కుటుంబాన్ని అనాథలుగా మార్చింది. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని సంగెంకలాన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం. గ్రామానికి చెందిన కల్లూరి భీమప్ప(27) ఆటో డ్రైవర్. వారం రోజుల క్రితం అల్లాపూర్‌కు చెందిన ఓ యువకుడిని ఆటో ఢీకొట్టడంతో బాధితుడి చేతిని తొలగించారు. దీంతో వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆటోడ్రైవర్‌ను గుర్తించి కరన్‌కోట్ పీఎస్‌లో కేసు నమోదు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. మంగళవారం గ్రామస్తులు భీమప్పను ఇంటి తీసుకెళ్లారు. ఆందోళన చెందిన భీమప్ప బుధవారం కర్ణాటక రాష్ట్రం చించోళిలో పురుగు మందు కొనుగోలు చేసి కల్లూరి సమీపంలో ఆ మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

ధైర్యంగా ఎదుర్కోవాలి

ఆటోతో ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో క్షతగాత్రుల ఫిర్యాదుతో భీమప్పపై చిన్న కేసు నమోదు చేశాం. మంగళవారం గ్రామస్తులు వచ్చి సొంత పూచికత్తుపై తీసుకెళ్లారు. బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి బాధపడ్డాం. కూర్చుని మాట్లాడుకునే విషయానికి ప్రాణాలు తీసుకోవడం సరికాదు. స్టేషన్‌లోనూ ఆయన్ను ఏమీ అనలేదు. ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి.

– మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ

ముదిరాజ్‌లపై చిన్నచూపు తగదు

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంత్ ముదిరాజ్

దోమ: ముదిరాజ్‌లపై రాజకీయ పార్టీల చిన్నచూపు తగదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంత్ ముదిరాజ్ అన్నారు. బుధవారం పాలేపల్లి, ఐనాపూర్ గ్రామాల్లో ఆ సంఘం నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలన్నీ ముదిరాజ్‌లను వాడుకుని వదిలేస్తున్నారని విమర్శించారు. అత్యధిక జనాభ కలిగి ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్క టికెట్ ఇవ్వకపోవడం సరికానది మండిపడ్డారు. కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి ముదిరాజ్‌లను మార్చాలని పలుమార్లు ధర్నాలు, ర్యాలీలు చేపట్టినా ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ నెల 15న పరిగిలో కొడంగల్ చౌరస్తా నుంచి మార్కెట్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించే ర్యాలీకి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం తాలూకా సలహాదారులు రామకృష్ణ ధనేశ్వర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి చందు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, సంఘం నాయకులు బాబయ్య, భీమయ్య, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న
ముదిరాజ్ సంఘం నాయకులు

గుర్తు తెలియని వాహనం ఢీ..

ద్విచక్ర వాహనదారుడు మృతి

చేవెళ్ల: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలోని ఖానాపూర్ స్టేజీ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మిర్జాపూర్‌కు చెందిన చాకలి రవి(40) ఖానాపూర్‌కు వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో చాయ్‌చస్కా హోటల్ వద్ద ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రవి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టు మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ భూములను కబ్జా చేస్తే ఊరుకోం

దేవాదాయ ధర్మాదాయ శాఖ
జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

మంచాల: ఆలయాలకు సంబంధించిన భూములను కబ్జా చేస్తే సహించేది లేదని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆరుట్ల శ్రీ రామచంద్ర స్వామి ఆలయ మాన్యం భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం పేరు మీద ఆరుట్ల గ్రామంలో 1581, 1582 సర్వే నంబర్లలో 12.16ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిని ఎవరైనా ఆక్రమించేందుకు, అన్యక్రాంతం చేసేందుకు యత్నించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న శేఖర్

'పాలమూరు - రంగారెడ్డితో' మేలు

- 16న ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం కేసీఆర్
- రాష్ట్రంపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమ
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో కల్వకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. రూ.35వేల కోట్లతో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో సుమారు 12.50లక్షల ఎకరాలకు, కల్వకుర్తి నియోజకవర్గంలో 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు పన్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై సవితితల్లి ప్రేమను చూపుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఈనెల 16న పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారని, ఇందులో భాగంగా ఈనెల 16న సీఎం కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్‌లోని లిఫ్ట్ మొదటి పంప్‌ను సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని కాళేశ్వరం, పాలమూర్–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తెలంగాణాకి ఇవ్వాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం గనుల ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ ఎందుకు కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 157 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క కళాశాలను కేటాయించలేదన్నారు. ఈ నెల 16న నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు పెద్ద ఎత్తున నియోజకవర్గం నుంచి తరలివెళ్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు దశరథ్‌నాయక్, వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.